ముఖారి ఝంప

ఎక్కువ తక్కువ లేవో - యెఱుగ మిద్దరిలోన
ఒక్కటై నీవురముపై - వున్నదిదె చెలియ

ఆకడ జలధి ద్రచ్చి - అమృత మిచ్చితివీవు
ఆకెకైతే మోవిజిందీ - నమృతము
సైకపు పసిడి చీర - సరిగట్టితివి నీవు
మేకొని యీమెకైతే - మేనెల్ల బసిడే

నిగిడి కౌస్తుభపుమా - ణికము గట్టితివీవు
మగువకైతే నోరెల్లా - మాణికములే
బెగడి యాకసమెల్లా - పెద్దసేసి కొలచితివి
బిగిసే యీచెలికైతే - బిడికెడు నడుమే

పలుమారు జలధిలో - బవళించితివినీవు
కలికి గుణములోనే - ఘనజలధి
యెలమి శ్రీ వేంకటేశ - యిప్పుడు గూడితిగాని
జలజాక్షి యైతే నిన్ను - సన్నలనే గలసె

మనమొక ప్రాణమిత్రుడింటికి వెళ్తాం. అతని భార్య అతను ఉండగా ఉభయులతో సంభాషిస్తూ ఆమెను పొగడుతాము. మన మిత్రుని కొంచెం ఎగతాళి చేస్తాము. 'శ్రీమహాలక్ష్మివి నీవు వరించబట్టి మనవాడు నారాయణమూర్తి అయ్యాడు. లేకపోతే దామోదరుడు గానే మిగిలేవాడు.' అని మిత్రుడి పూర్వాశ్రమ పరాక్రమం గురించి చెప్పి నీవల్ల యింతవాడయ్యాడు ఇప్పుడు అంటాం ఆమెతో. అది మార్యాద. అది స్నేహమాధుర్యపు జున్నులో పొసగించిన మిరియపు పోపు. ఈ సంకీర్తనలో ఆ ధర్మమే వెలయించారు అన్నమాచార్యులు.

మీ యిద్దరిలో ఎక్కువ తక్కువలు ఎలాగ నిర్ణయించడం ? ఇద్దరూ ఒక్కటయ్యారు. ఆమె నీ గుండెపైనే ఉన్నదికదా. తారతమ్యాలింక దేనికి ? అంటూనే చక్కని రసపరీక్ష చేస్తున్నారు  అన్నమాచార్యులు.

అప్పుడెప్పుడో (యుగారంభానికి ఆ చివరన) నువ్వు (కూర్మమై) జలనిధిని మథించేసి అమృతం తెప్పించావట. ఎంత కష్టపడ్డావు. ఈ అలమేల్మంగకైతే పెదవుల చివర చిందుతున్నది అమృతం. శరధి చిలికి అమృతం తెచ్చావా నీవు? ఈమె సద్యోధరామృత వర్షిణి. బంగారు పోగుల జరీ అంచు బట్ట కట్టు కొన్నావా? గొప్పపనిచేశావులే! మా బంగారుతల్లి అలమేల్మంగకు ఒళ్లంతా బంగారమే. నీవు కనకాంబరుడివే. ఆమె కనకాంగి.

కౌస్తుభమణి జగద్దర్శనంగా కట్టినట్టున్నావు. ఈవిడకైతే నోటినిండుగా మాణిక్యాలున్నాయి. ఆమె పలువరసమణుల వరుస. వామనుడవై పాదంతో ఆకాశమంతా కొలిచేసి పెద్దగొప్పఅనుకుంటున్నావేమో ఆకాశమంతటినీ పిడికెడు నడుములో బిగించుకొన్నదియీ చెలి. నీపాదము ఆకాశ ప్రామాణ్యమైతే ఆకాశానికి ప్రామాణ్యం ఈమె నెన్నడుము.

ఎన్నో పర్యాయాలు నీవు సముద్రంలో శయనించావుట. గొప్పచాల్లే. ఈమె గుణములో మహాసముద్రము. శ్రీవేంకటేశ్వరా నీవీమెను యిప్పుడు కలసినావు గాని ఈ అలమేల్మంగ నిన్ను ఇంతకు ముందెన్నడో సంజ్ఞాపురస్సరంగా కలసినది. అయినా మీరిద్దరూ ఒక్కటే. మీతారతమ్యాలు నాకేమితెలుసు అని తాను లౌక్యంగా తప్పుకుంటూ శ్రీవేంకటేశ్వర  ప్రియచతుర సరసోక్తులు ఒలికించారు సంకీర్తనా చార్యులు.